క్లుప్తంగా

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఐనవోలు : మండలంలోని సింగారం గ్రామంలో కోటగండి పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, జలగం అనిత, రంజిత్, సొనబోయిన సతీష్, సొసైటీ చైర్మన్ జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న మహాశివరాత్రి జాగరణ మహోత్సవం



పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18న మహా శివరాత్రి జాగరణ మహారుద్రయాగ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. హన్మకొండలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేతుల మీదుగా శివరాత్రి మహోత్సవ కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. శివనామ సంకీర్తనలతో అత్యంత వైభవంగా జరుగనున్న శివరాత్రి ఉత్సవాలకు భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

'మోడల్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు గాను అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో వంద, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుము చెల్లించి ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారి మజ్జిగ వెంకటనర్సు గురువారం రాత్రి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. తొలుత వెంకటనర్సు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటనర్సు కుమారుడైన మండల రైతుబంధు అధ్యక్షుడు మజ్జిగ జైపాల్‌ను ఎమ్మెల్యే ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఉస్మాన్‌అలీ, పాలెపల్లి శంకర్‌రెడ్డి, తక్కళ్లపెల్లి చందర్‌రావు, పొన్నాల రాజు, కడుదూరి రాజు, అద్దగూడి సతీష్, మునిగాల సమ్మయ్య, వడిచర్ల శ్రీనివాస్, ఆడెపు దయాకర్, సురేష్, నరేష్, రాజ్‌కుమార్, అశోక్, మధుకర్, రాజు యాదవ్ వేర్వేరుగా పరామర్శించారు.

బీఆర్ఎస్ నాయకుల..

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన సామల రాజమణి శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. తొలుత రాజమణి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పాపని రవీందర్, వంగాల భగవాన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ అంకూస్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న క్రమంలో ఈనెల 11న గ్రేటర్ వరంగల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ టౌన్ డీఈలు జి.సాంబరెడ్డి, ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్, శివారు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్లలో దశల వారీగా సరఫరా నిలిపివేయనున్నట్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న ఎంపీపీ జక్కుల అనిత

భీమదేవరపల్లి : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో మరింత ఆసక్తి చూపుతూ నైపుణ్యం సాధించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిభ చాటి క్రీడాంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుకోవడంతోపాటు క్రీడల్లో సైతం పట్టు సాధించాలని చెప్పారు. ఎంపీపీ జక్కుల అనిత, భీమదేవరపల్లి ఎంపీటీసీ సాతూరి రమ కబడ్డీ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎస్సై ప్రవీణ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మార్పాటి మహేందర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు పచ్చునూరి కరుణాకర్, రాజేశ్వరి, చంటి, రాజ్‌కుమార్, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సేవలు మరువలేనివి

- జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : గ్రామ స్థాయిలో ప్రజలకు ఆర్ఎంపీలు, పీఎంపీలు అందిస్తున్న వైద్యసేవలు మరువలేనివని వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పల్లెల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా సత్వరమే ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఘనత ఆర్ఎంపీ, పీఎంపీలకే దక్కుతుందని చెప్పారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయవద్దని చెప్పారు. ఆర్ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, గాజే రాజేందర్, సంఘం మండల అధ్యక్షుడు కానుగుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి అబ్బు జయపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కందగట్ల అనిల్, కోశాధికారి చెక్క భిక్షపతి, సహాయ కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



ఆత్మకూరు : ప్రారంభిస్తున్న సర్పంచ్ రవికుమార్



దామెర : కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఆత్మకూరు : మండలంలోని చౌళ్లపెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కంచె రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల కంటి సంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. 18 ఏళ్లకు పైగా వయస్సు కలిగిన ప్రతిఒక్కరూ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వ్యక్తులకు ఉచితంగా కళ్లద్దాలు ఇస్తారని, అవసరమైతే శస్త్రచికిత్స సైతం చేయిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యల పట్ల అజాగ్రత్త చేయకూడదని చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్యా రఘుపతిరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



ఐనవోలు : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై గుగులోత్ వెంకన్న కథనం ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా మండలంలోని నందనం గ్రామంలోని ఆకేరు వాగు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తవ్వి వరంగల్‌కు రవాణా చేస్తుండగా ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వాహనదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

టాయిలెట్ల బిల్లు బకాయి ఇప్పించాలి : సర్పంచ్

నడికూడ : ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో తాను నిర్మించిన బాలబాలికల టాయిలెట్లకు సంబంధించిన బిల్లు బకాయి ఇప్పించాలని సర్పంచ్ ఊర రవీందర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో రూ.5 లక్షల ఈడబ్ల్యూఐడీసీ నిధులతో టాయిలెట్లు నిర్మించగా రూ.1.30 లక్షలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. మిగతా రూ.3.70 లక్షలు ఇవ్వకుండా, ఎంబీ రికార్డు చేయకుండా సుమారు రెండేళ్లకుపైగా ఏఈ రాజు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తనకు బిల్లు బకాయి డబ్బులు ఇప్పించి సమస్య పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు

శాయంపేట : విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ, ఇతర అన్ని రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు సూచించారు. ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రాంలో పాల్గొన్న మండల కేంద్రంలోని ఆ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఒక్కో టీంకు నలుగురు చొప్పున ఐదు టీంల్లో 20 మంది విద్యార్థులు ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రోగ్రాంలో పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు. ఈ క్రమంలోనే పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేసినట్టు వివరించారు. విద్యార్థులు ఎలాంటి ప్రతిభా పాటవ పరీక్షనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎండీ.అబ్దుల్లా, సైన్స్ టీచర్ సత్యప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం'



మాట్లాడుతున్న సాంబమూర్తి

ఆత్మకూరు : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత సాంబమూర్తి తెలిపారు. మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని చెప్పారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయచందర్ రెడ్డి, కార్నర్ మీటింగ్స్ కన్వీనర్ గురిజాల శ్రీరాం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇర్సడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఆర్టీఐ కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, ఓబీసీ సెల్ కన్వీనర్ సదానందం, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, కిసాన్ సెల్ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, బయ్య పైడి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమే లక్ష్యంగా సమావేశాలు



మాట్లాడుతున్న శ్రీరాం భూపాల్

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా శక్తి కేంద్ర కార్మిక సమావేశాలు నిర్వహించాలని శక్తి కేంద్రాల కోఆర్డినేటర్ అర్షనపల్లి శ్రీరాం భూపాల్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, ఉద్యోగ, రైతు, అన్ని వర్గాల ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, ఎమ్మెల్యేల వైఫల్యాలను ప్రజలకు ఎత్తిచూపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు, కోశాధికారి బొల్లపెల్లి మహేశ్వర్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ గుండపు యుగంధర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు మోడెం మహేందర్ రెడ్డి, కత్తుల రాజ్‌కుమార్, తక్కళ్లపెల్లి యుగందర్, ఓరుగంటి సంపత్, ఎం.రాకేశ్, ఇలాసారపు రాజేశ్, అమరవాది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల మాల విరమణ

కమలాపూర్ : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో పలువురు అయ్యప్ప స్వాములు శుక్రవారం మాలా విరమణ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠాపనోత్సవాలను పురస్కరించుకుని సుమారు మూడు నెలల క్రితం పలువురు భక్తులు అయ్యప్ప స్వామి మాలాధారణ చేశారు. ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠాపనోత్సవాలు పూర్తి కావడంతో బుధ, గురు, శుక్ర వారాల్లో పద్నాలుగు మంది అయ్యప్ప స్వాములు ఇరుముడులు ధరించి మాల విరమణ చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి, ప్రతిష్ఠాపనకు సహకరించిన సర్పంచ్ కట్కూరి విజయ, భూదాత పల్లె బక్కిరెడ్డి, గురుస్వామి ఇందుర్తి జానకి రామారావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్‌గౌడ్, శ్రీ ధర్మశాస్తా సేవా సమితి మండల అధ్యక్షుడు పెరుమాండ్ల సమ్మయ్య, నాయకులు ఎండపెల్లి మల్లారెడ్డి, జక్కు కృష్ణమూర్తిగౌడ్, పచ్చిమట్ల రాజయ్య గౌడ్, దుండుకూరి రాజు, రామగిరి శ్రీధర్, జక్కు సాయి, అయిలయ్య, భక్తులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీధర్‌రెడ్డి

దామెర : మండలంలోని అన్ని గ్రామాల్లోని అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి అద్దంలా తీర్చిదిద్దడమే పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి లక్ష్యమని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము తెలిపారు. మండలంలోని ఓగ్లాపూర్ గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్ రెడ్డితో కలిసి రాము శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మండలం కొత్తగా ఏర్పడ్డ నేపథ్యంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిపల్లి సరోజన, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జాకిర్, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, నాయకులు జన్ను మల్లయ్య, అఖిల్ పాషా, రాజిరెడ్డి, కన్నెబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో కూలీలకు లబ్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

దామెర : ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులతో కూలీలకు లబ్ధి చేకూరుతుందని ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ పనులపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని స్పష్టం చేశారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



శాయంపేట : యోగా సాధన ద్వారానే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రముఖ యోగా ట్రైనర్ కృష్ణనాయక్ తెలిపారు. యోగాపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో మైసూర్‌లో ప్రారంభించిన కృష్ణనాయక పాదయాత్ర నాలుగు నెలలుగా కొనసాగుతూ మండలంలోని మందారిపేట స్టేజీ వద్దకు శుక్రవారం చేరుకుంది. కృష్ణనాయకకు కాంగ్రెస్ యూత్ నాయకులు సాదు నాగరాజు, అనిల్ సాధారంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కృష్ణనాయక మాట్లాడారు. పాఠశాలల విద్యార్థులకు యోగా ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యోగా సాధన చేయడం ద్వారా అన్ని రకాల వ్యాధుల నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రతిరోజూ యోగా చేస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడవచ్చని తెలిపారు. 28 రాష్ట్రాల్లో రెండేళ్లపాటు పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు. యోగాపై అవగాహన కల్పించడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

కమలాపూర్ : రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు కె.దామోదర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి సాగులో పాటించాల్సిన మెళకువల పట్ల రైతులు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. తెగుళ్ల బారి నుంచి పంట కాపాడుకునేలా అధికారుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. రైతులు తప్పనిసరిగా పీఎం కిసాన్ ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, కేడీసీసీ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకులను సందర్శించి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ప్రోగ్రెస్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారి (టెక్నికల్) రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.సరిత, కె.సరిత, ఎం.వినయ్‌వర్మ, ఎస్.ప్రతాప్, జి.రాజు, ఆయా బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు జంగా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో జనగామ కాంగ్రెస్ పార్టీ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ధర్మసాగర్‌లో పార్టీట మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వేలేరు మండల కేంద్రంలో సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు జాలిగపు వనమాల, రొండి రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డు లెనిన్, నాయకులు జాలిగపు దుర్గయ్య, భిక్షపతి, సారజి కుమార్, వక్కల రవి, ఠాకూర్ ఉమ, యామిని, అంకం రాజకుమారి, కొమ్ము రమ్య, గణేష్, శ్యామ్, వెంకటేష్, బొల్లెడ్ల పాపిరెడ్డి, రావుల భూపాల్‌రెడ్డి, వేణు మహేందర్ రెడ్డి, రాజయ్య, బాపురెడ్డి, ప్రశాంత్, బైరి అనిల్, అక్కల ప్రశాంత్, సలీం మాలిక్ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో వృద్ధుడి ఆత్మహత్య

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన గందసిరి దానయ్య (70) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ కె.వీరస్వామి కథనం ప్రకారం.. దానయ్య ఏడాది క్రితం రెండు కళ్లకు ఆపరేషన్ చేయించుకోగా కొద్ది రోజులు చూపు బాగానే ఉన్నా తదనంతరం కళ్లు కనిపించక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూమ్‌లో ఇనుప పైప్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కిరాణా షాప్‌కు వెళ్లి వచ్చిన అతడి భార్య గమనించి ఇరుగు పొరుగు సాయంతో దానయ్యను కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కాంగ్రెస్ కార్పొరేటర్లపై ఎమ్మెల్యే కక్ష సాధింపు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ వేధింపులకు గురిచేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. హనుమకొండలోని 5వ డివిజన్‌లో కొత్తూరు పోచమ్మగుడి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన పలుకాలనీల్లో పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ ఆధీనంలో ఉండాల్సిన డివిజన్ కమ్యూనిటీ హాల్‌ను బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ విద్యాసాగర్ ఆధీనంలో ఎందుకు ఉందని ప్రశ్నించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వినయ్‌భాస్కర్‌కు డివిజన్లలో ప్రొటోకాల్ పాటించాలనే సోయి లేకుండా పోయిందని ఆరోపించారు. డివిజన్‌లో జరిగే అధికారిక కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్‌ను వేదికపై ఎలా కూర్చోబెడుతారని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పార్టీలకు అతీతంగా డివిజన్లను అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, నాయకులు అనిత, శ్రావణ్, మానిక, అహల్య, సతీష్, సురేందర్, గోపి, స్వప్న, బంక సరళ, బొమ్మతి విక్రం పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ పిలుపునిచ్చారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 22వ డివిజన్‌లోని 80 ఫీట్ల రోడ్డు, శాంతినగర్, తదితర ప్రాంతాల్లో సురేఖ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోందని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గంలోని 22వ డివిజన్‌లో గతంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఇప్పటి ఎమ్మెల్యే నరేందర్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాచరిక పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సయ్యద్ వసీం, మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, మడిపల్లి కృష్ణ, కూరతోట సదానందం, చిప్ప వెంకటేశ్వర్లు, దాసరి రాజేష్, కూచన రవీందర్, కర్ణాకర్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'భట్టి విక్రమార్క మాటలు వెనక్కి తీసుకోవాలి'

హన్మకొండ: చేపలు పట్టడం ముదిరాజ్ కులస్తులు జీవనాధారం అని, అలాంటి వృత్తిలోకి ఇతర కులాలను చేర్చాలని శాసనసభలో కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత బట్టి విక్రమార్క అనడం సబబు కాదని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని కేంద్ర కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గాల్లో మెజారిటీ ప్రజలు చేపలు పట్టుకొని కుటుంబాలను పోషిస్తున్నారని గుర్తుచేశారు. ముదిరాజ్‌లు తమను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని పోరాడుతున్న క్రమంలో బీసీలోని ఇతర కులాలను చేపల వృత్తిలోకి చేర్చాలని బట్టి విక్రమార్క అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇతర కులాలను చేపల వృత్తిలోకి చేరిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.